క్లుప్తంగా

సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులే


హెచ్ఎం, ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న సభ్యులు

బేతంచెర్ల: తరగతి గదుల్లో విద్యాబుద్ధులు నేర్పి సమాజానికి మార్గదర్శకులుగా నిలిచేవారు ఉపాధ్యాయులేనని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి రాజు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సీతారామాపురం జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హెచ్ఎం వాజీదున్నీసా బీబీ, గణిత ఉపాధ్యాయురాలు సుజాతను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నజీమున్నిసా, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటశేషయ్య, శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ సభ్యులు మురళీకృష్ణ, వలిబాషా, కేశాలు నాయుడు, వన్నూర్ సాహెబ్ పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న తిరుపాల్‌రెడ్డి

అవుకు(కొలిమిగుండ్ల): కోనాపురానికి చెందిన కోన కంబిరెడ్డి కుమారుడు కార్తీక్‌రెడ్డి(21) మృతికి ఆదివారం వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి నివాళులర్పించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, జగదీష్, ఆదినారాయణరెడ్డి, తిరుమలేష్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, నరసింహులు ఉన్నారు.

బైక్ నుంచి పడి వృద్ధుడికి గాయాలు


ధర్మరాజును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఓ వృద్ధుడు బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి కిందపడి గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ముక్కమల్ల గ్రామానికి చెందిన ధర్మరాజు వ్యక్తిగత పనులతో ఆకుమల్లకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వసంతాపురం క్రాస్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయనకు గాయాలయ్యాయి. వాహనదారులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బైక్‌పై ప్రయాణిస్తుండగా తల తిరగడంతో ప్రమాదం జరిగినట్లు ధర్మరాజు కుటుంబ సభ్యులు తెలిపారు.

పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభించాలి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి చందు

బనగానపల్లె రూరల్: పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి చందు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పీజీ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల డిపార్ట్‌మెంట్‌లలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం వల్ల మూతపడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అలాగే ఐసెట్ రెండో దశ కౌన్సెలింగ్, ఇంజినీరింగ్ మూడో దశ కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకులు మహేష్, శ్రావణ్, బ్రహ్మం, సుదర్శన్, సలీం పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత


ట్రైసైకిల్ అందజేస్తున్న విక్కీ ఫౌండేషన్ అధినేత

కోవెలకుంట్ల: నంద్యాలకు చెందిన ఓ దివ్యాంగుడికి కోవెలకుంట్ల విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ట్రైసైకిల్ అందజేశారు. ఆశీర్వాదం అనే దివ్యాంగుడు కాలు లేక నడవలేని స్థితిలో ఉండగా గుర్తించిన గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తన ఫౌండేషన్ తరుపున ట్రైసైకిల్ అందజేసి మానవత్వం చాటారు. కార్యక్రమంలో సభ్యులు మురళి, ఉసేన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

కాలనీలు.. సమస్యల లోగిళ్లు

- బేతంచెర్లలో కాలనీల అభివృద్ధి శూన్యం
- కూటమి ఏడాది పాలనలో జాడలేని అభివృద్ధి పనులు
- సీసీరోడ్లు, కాలువలు లేక స్థానికుల అవస్థలు
- వర్షాకాలంలోనూ వెంటాడుతున్న తాగునీటి సమస్య


గాయత్రి నగర్‌లోని గ్రంథాలయం ఎదుట మురుగునీటి నిల్వ.


ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో బురదమయంగా రోడ్డు


పట్టణంలో నిలిచిపోయిన కందకం పనులు

బేతంచెర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా బేతంచర్ల పట్టణ అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. నగర పంచాయతీ పరిధిలోని కాలనీల్లో డ్రైనేజీ కాలువలు, సీసీరోడ్లు వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయి. బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులు, సుమారు 45 వేల జనాభా ఉన్నారు. ఎన్జీవోస్ కాలనీ, శేషారెడ్డి పార్కు, గాయత్రి నగర్, డ్రైవర్స్ కాలనీ, సుందరయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్ల పనులు చేపట్టలేదు. పారిశుద్ధ్య సిబ్బంది కొరత, అధికారుల పర్యవేక్షణ లోపంతో కాల్వలు మురుగుతో నిండి వీధుల్లోకి ఉప్పొంగుతున్నాయి.

వర్షాకాలంలో తాగునీటి సమస్య

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రూ.351 కోట్లతో వాటర్‌గ్రిడ్ పథకం మంజూరు చేసి గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా ప్రారంభించారు. అయినప్పటికీ పట్టణానికి ఇప్పటికీ వారానికి ఒక్కసారి మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారు. దీంతో వేసవికే పరిమితమైన తాగునీటి సమస్య, వర్షాకాలంలో కూడా ఉత్పన్నమవుతోంది. అదేవిధంగా గత ప్రభుత్వం కేటాయించిన రూ.3.50 కోట్లతో గౌరిపేట, కోటపేట, డ్రైవర్స్ కాలనీల వెంట కందకం అభివృద్ధి పనులు 90 శాతం పూర్తయినా కాంట్రాక్టర్ల బిల్లులు ఇంతవరకు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఇక అమృత్ 2.0 పథకం కింద చేపట్టే రూ.42 కోట్ల ఇంటింటికీ కొళాయి కనెక్షన్ల ప్రాజెక్టు ఇప్పటికీ రూపుదాల్చకపోవడం పట్టణ ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది.

కాలనీల అభివృద్ధికి చర్యలు అవసరం



వార్డు పరిధిలోని డ్రైవర్స్ కాలనీ, సుందరయ్య కాలనీ, అల్లబకాష్ దర్గా ఏరియాలో సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలి. దుర్గాపేట ఓవర్ హెడ్ ట్యాంక్ పైకప్పు లేక చెత్త, చెదారంతో నీరు కలుషితం అవుతోంది. గోరుకల్లు రిజర్వాయర్ నీరు మా కాలనీకి అందడం లేదు. కుక్కల బెడద ఎక్కువగా ఉంది. అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి.

–కొట్ల మధుసూదన్‌రావు, 14వ వార్డు కౌన్సిలర్

ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం



మా వార్డులోని సమస్యలను సమావేశంలో చర్చించడం మినహా అభివృద్ధి పనులు ఏవీ చేపట్టలేదు. కనీసం డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు, పెద్దలపై కుక్కల దాడులు జరుగుతున్నాయి. ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది.

–షేక్ ముబీనా, 5వ వార్డు కౌన్సిలర్

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయాలి



మా వార్డులో గతంలో వేసిన సీసీ రోడ్లు దెబ్బతిన్నాయి. సమావేశాల్లో సమస్యలు వినిపించినా పరిష్కారం కాని పరిస్థితి. అధికారులు వెంటనే స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలి. నిలిచిపోయిన కందకం అభివృద్ధి పనులు పూర్తి చేయాలి. వర్షాకాలంలో నీరు కాలనీలోకి చేరే ప్రమాదం ఉంది. ఆకతాయిలకు అడ్డుకట్ట వేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

–శకుంతల, 20వ వార్డు కౌన్సిలర్

భక్తిశ్రద్ధలతో జ్యోతుల మహోత్సవం


చౌడేశ్వరీదేవి


జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామంలో మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం జ్యోతుల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు 35 జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి చౌడేశ్వరీదేవి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, ఉపసర్పంచ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జ్యోతులు

కొలిమిగుండ్ల: కోటపాడులో చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవం నిర్వహించారు. గ్రామ పెద్దల సహకారంతో తొగటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రారంభమైన జ్యోతుల కార్యక్రమం ఆదివారం ఉదయంతో ముగిసింది. గ్రామ వీధుల మీదుగా తొగటవీర క్షత్రియులు అమ్మవారి పాటలు ఆలపిస్తూ.. నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రైతులు ఆందోళన చెందవద్దు


సమావేశంలో మాట్లాడుతున్న మద్దిలేటి

బనగానపల్లె: పంటలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి మద్దిలేటి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆదివారం మండల ఏఓ సుబ్బారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఖరీఫ్‌లో 5,95,535 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారన్నారు. జిల్లాలో మొక్క జొన్న, వరి అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 9,10,11 తేదీల్లో జిల్లాకు 5,200 టన్నుల యూరియా రానున్నట్లు ఆయన తెలిపారు. కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా యూరియా పంపిణీ

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో ఆదివారం వ్యవసాయాధికారి ఖలిమున్నీషా ఆధ్వర్యంలో రైతులకు పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు. శనివారం పంపిణీ ఆలస్యం కావడంతో పట్టాదారు పాసు బుక్‌లు ఆధారంగా టోకెన్‌లు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు ఎండకు నిలబడకుండా షామియానాతో పాటు కుర్చీలు ఏర్పాటు చేయించారు. పంట పొలం విస్తీర్ణం ఆధారంగా ఒక్కో రైతుకు రెండు బస్తాల మేర అందజేశారు. 300 టోకెన్ల వరకు యూరియా అందించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మండలానికి త్వరలోనే యూరియా వస్తుందని తెలిపారు.

ఆలయాల మూసివేత


యాగంటి ఆలయాన్ని మూసివేస్తున్న ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, అర్చకులు

బనగానపల్లె రూరల్: సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో మండలంలోని పలు ఆలయాలను ఆదివారం తాత్కాలికంగా మూసివేశారు. యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని మధ్యాహ్నం 1.30 గంటల తరువాత ఆలయ ఈఓ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు మూసివేశారు. అదే విధంగా నందవరం చౌడేశ్వరి దేవి ఆలయాన్ని అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో మూసివేశారు. చంద్ర గ్రహణం అనంతరం సోమవారం ఉదయం ఆలయ శుద్ధి, పుణ్యాహవచన, నిత్యపూజల అనంతరం భక్తులకు యథావిధిగా దర్శనం కల్పిస్తామని అధికారులు తెలిపారు.

- **బేతంచెర్ల:** మండల పరిధిలోని మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు మూసివేశారు. ముందుగా ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా కళ్యాణ చక్రవర్తి, ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు దర్శనం కల్పిస్తామని ఉప కమిషనర్ రామాంజనేయులు తెలిపారు.
- **డోన్:** చంద్రగ్రహణం కారణంగా స్థానిక వేంకటేశ్వర ఆలయాన్ని ఆదివారం ఉదయం 11 గంటల నుంచిసోమవారం ఉదయం 9 గంటల వరకు మూసివేసినట్లు ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రాముశర్మలు తెలిపారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని తిరిగి తెరిచి భక్తులకు దర్శనం కలిపిస్తామని వివరించారు.



వెలుగుతున్న సెంట్రల్ లైటింగ్

సెంట్రల్ లైటింగ్ సమస్య పరిష్కారం

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ఎట్టకేలకు వెలిగింది. ఆరు రోజులుగా లైటింగ్ పనిచేయకపోవడంతో రహదారి అంధకారంలో మునిగిపోయింది. ఈనెల 5న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందనగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆదివారం సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది ఏపీజీబీ బ్యాంక్ ఎదురుగా భూగర్భ కేబుల్ కట్ కావడంతో మరమ్మతులు చేపట్టారు. తరువాత సెంట్రల్ లైటింగ్‌ను యథావిధిగా వెలిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రధాన రహదారి మళ్లీ వెలుగులతో కళకళలాడుతోంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల పరిధిలో 11 కేవీ ఫీడర్ నిర్మాణ పనుల కారణంగా సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వినయ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణాపురం, మాధవరం, గార్లదిన్నె గ్రామాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.

వ్యవసాయానికి విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ ఏడీఈ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని ఆయా గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉంటుందని పేర్కొన్నారు.

- **సంజామల:** మండల పరిధిలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న గ్రామాలకు ఈ వారం పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల-నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

పోక్సో కేసులో నిందితుడి ఆత్మహత్య

కోవెలకుంట్ల: పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కంపమల్ల గ్రామానికి చెందిన మయుడు(36) ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు.. పోక్సోకేసులో రాజీ విషయం కొలిక్కి రాకపోవడంతో మయుడు మనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుంతలో పడి బాలుడికి గాయాలు

బేతంచెర్ల: స్థానిక అయ్యల చెరువులోని పాలీస్ ఫ్యాక్టరీ ఆవరణలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సిద్ధిక్, జుంగా దంపతుల 8 నెలల నిషా ఆడుకుంటూ వెళ్లి మట్టి గుంతలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు చిన్నారిని శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

డోన్: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దేవేంద్రప్పను కర్నూలులోని టీటీడీ కళాక్షేత్రంలో టీటీడీ సాహితీ సాంస్కృతిక సంస్థ ఆదివారం ఘనంగా సన్మానించింది. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి సామేల్, సంస్థ అధ్యక్షుడు పత్తి ఓబయ్య, కార్యదర్శి హరికిష్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులపై దళారుల దందా

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఉల్లి పంట సాగు చేసిన రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి ధరలు పడిపోవడంతో ప్రభుత్వం క్వింటాకు రూ.1200 మద్దతు ధరగా నిర్ణయించింది. అయితే ఆర్ఎస్ రంగాపురం, గూటుపల్లె గ్రామాల్లో దళారులు రైతుల వద్దకు వెళ్లి క్వింటాకు రూ.1100కే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు క్వింటాకు రూ.100 వరకు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు పర్యవేక్షణ చేయకపోవడమే కాకుండా, దళారులతో కుమ్మక్కయి ఉన్నారనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1200 కూడా గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు. వ్యాపారులు మాత్రం రైతుల బలహీనతను సొమ్ము చేసుకుంటూ రూ.1100కే కొనుగోలు చేస్తున్నారు. పంట సాగు కోసం తీసుకున్న అప్పులు తీర్చడానికి తప్పనిసరిగా ఉల్లిని అమ్మాల్సిన పరిస్థితి వచ్చిందని ఆర్ఎస్ రంగాపురానికి చెందిన రైతు మద్దయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం


మాట్లాడుతున్న మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- రేపు రైతు వ్యతిరేక పోరు
- పోస్టర్లను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. ఆదివారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహంలో జరిగిన సమావేశంలో మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, పార్టీ వ్యవసాయ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టుపల్లె వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం ఎంపిక నుంచి పంటకు గిట్టుబాటు ధర కల్పించిందని గుర్తుచేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు గిట్టుబాటు ధరలు లేకుండా, విత్తనాలు-ఎరువులు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఉల్లి, టమాట వంటి పంటలకు సరైన ధర దక్కక, పెట్టుబడులు కూడా తిరిగి రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటికి నిరసనగా ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న రైతుపోరులో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అన్నదాత పోరు కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు.

బ్లాక్ మార్కెట్‌కు యూరియా

నియోజకవర్గానికి మంజూరైన 70 టన్నుల యూరియాను అధికార పార్టీ నేతలు బినామీ పేర్లతో బ్లాక్ మార్కెట్‌కు తరలించారని ఆరోపించారు. రైతులకు అవసరం లేని సమయంలో యూరియా పంపిణీ చేసినట్లు చూపించారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు పసాద్, పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, నాయకులు ఎద్దుల రాజేంద్రనాథ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజవర్దన్, కురుకుందు హరి, దినేష్‌గౌడ్, పాలుట్ల రఘురాం, ఆర్ట్ రమణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరును విజయవంతం చేయాలి


అన్నదాత పోరు వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవెలకుంట్ల: రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ‘అన్నదాత పోరు’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి, గ్రీవెన్స్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి అన్నారు. ఆదివారం కోవెలకుంట్లలోని బీవీ స్వగృహంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేయగా ప్రస్తుత కూటమి సర్కార్ రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కొద్ది రోజుల నుంచి రైతులకు యూరియా దొరక్క అవస్థలు పడుతున్నారన్నారు. ఎరువుల బ్లాక్‌మార్కెట్‌ను నియంత్రించాలని, పక్కదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంట బీమాను పునరుద్ధరించాలని, వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం డోన్‌లో నిర్వహించే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాంభూపాల్ రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, మహమ్మద్ రఫీ, సమీర్, జనార్దన్, అన్వర్, రామకృష్ణ, మనోహర్, మధు, గిరి, సుబహాన్, విశ్వం, రమేష్, ఇంద్ర, రాజేష్, షరీఫ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

డోన్ టౌన్: పట్టణంలోని యశోద సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. సుమారు 150 మంది వివిధ పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ సుంకన్న సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో కూడా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


2000–2002 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ కలయిక

కోవెలకుంట్ల: పట్టణంలోని గోటూరు జూనియర్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. కళాశాలలో 2000–2002 సంవత్సరంలో ఇంటర్ చదివిన దాదాపు వంద మంది విద్యార్థులు ఒక వేదికపై చేరారు. అప్పటి జ్ఞాపకాలు, మధుర స్మృతులు, అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన నాటి అధ్యాపకులు కేవీ సుబ్బారెడ్డి, పార్వతీ, మహేశ్వరరెడ్డి, మద్దిలేటి, మునిస్వామి, నిర్మల, శ్రీనివాసులు, భాస్కర్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.